
సాక్షి గుంటూరు

శుక్రవారం । 8 । డిసెంబర్ । 2023



రేణుకాఎల్లమ్మ గుడికి భూమిపూజ

అచ్చంపేట: ప్రభుత్వం కేటాయించిన స్థలంలో గౌడ కుల దేవత రేణుకా ఎల్లమ్మతల్లి, కంఠ మహేశ్వరస్వామి గుడి నిర్మాణానికి ఎమ్మెల్యే శంకరరావు గురువారం భూమిపూజ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 522.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.



భక్తిశ్రద్ధలతో కోటిదీపోత్సవం

మచిలీపట్నంటౌన్: బందరు రాబర్ట్‌సన్‌పేట లోని రామలింగేశ్వరస్వామి గుడిలో గురువారం కోటి దీపోత్సవం జరిగింది. 35 అడుగుల శివుడి విగ్రహం వద్ద దీపాలను వెలిగించారు.

న్యూస్‌రీల్

రెండు చోట్ల ఉన్న ఓట్లను తొలగించండి

వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్



గుంటూరు వెస్ట్ : ఇటీవల తెలంగాణ ఎన్నికల్లో ఓట్లు వేసిన కొందరికి మన జిల్లాలో, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో ఓట్లు ఉన్నాయని, వాటిని తొలగించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ జిల్లా కలెక్టర్ వేణుగోపాలరెడ్డికి వినతి పత్రం అందజేశారు. గురువారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో డొక్కా మాట్లాడుతూ రెండు చోట్ల ఉండటం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. దీని వల్ల అక్రమాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో అత్తోట జోసఫ్, అంగడి శ్రీనివాస్, షేక్ మస్తాన్‌వలి, మాదా రాధాకృష్ణమూర్తి, పాల్గొన్నారు.

10 నుంచి ఆల్ ఇండియా క్యారమ్స్ టోర్నమెంట్

గుంటూరు వెస్ట్ (క్రీడలు) : ఆల్ ఇండియా క్యారమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం నిర్వహణలో ఈ నెల 10 నుంచి 13 వరకు విశాఖలో 28వ ఆల్ ఇండియా ఫెడరేషన్ కప్ క్యారమ్స్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పోటీల నిర్వహణ కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 26 రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొంటాయన్నారు. మొత్తం రూ.25 లక్షల వ్యయంతో భారీ స్థాయిలో ఏపీ రాష్ట్ర క్యారమ్స్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ నీరజ్ కుమార్ సంపతి నేతృత్వంలో నిర్వహిస్తామన్నారు. జిల్లా నుంచి పి.శ్రీనివాసరావు, షేక్ ఎండి సాదిఖ్, సిహెచ్ సుధలు ఎంపికయ్యారని పేర్కొన్నారు.

ప్రత్యేక అలంకారంలో నరేంద్రస్వామి



పెదపులివర్రు(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామంలో కొలువైన బాలా త్రిపుర సుందరి సమేత రాజరాజ నరేంద్రస్వామి దేవాలయంలో కార్తిక మాసం బహుళ దశి పురస్కరించుకుని గురువారం స్వామి వారికి 25వ రోజు ప్రాతఃకాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అలాగే స్వామి వారికి ద్వాదశ హారతులు కొనసాగుతున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు ఆమంచి సృజన్ కుమార్ శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమాలను దేవస్థాన కమిటీ చైర్మన్ జంపని అంజయ్య, కార్యనిర్వాహణాధికారి మేకా సాంబశివరావు పర్యవేక్షిస్తున్నారు.

మూడు రోజుల వ్యవధిలో 3,966 మిల్లీమీటర్ల వర్షం

నరసరావుపేట: జిల్లాలో గడిచిన 24 గంటల వ్యవధిలో ఎక్కడా వర్షం పడలేదని వాతావరణశాఖ అధికారులు గురువారం వెల్లడించారు. మిచాంగ్ తుఫాన్ వల్ల నాలుగో తేదీ నుంచి ఆరో తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురిసిన విషయం తెలిసిందే. ఆ మూడురోజుల వ్యవధిలో జిల్లాలోని 28 మండలాల్లో 3,966.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సగటున ప్రతి మండలంలో 141.6 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. 5న 1,252.4 మి.మీ. వర్షం పడగా 6న 2,713.6 మిల్లీమీటర్ల వర్షం పడింది. మూడురోజుల వ్యవధిలో చిలకలూరిపేటలో అత్యధికంగా 243.6 మి.మీ. వర్షం పడగా, సత్తెనపల్లిలో 232.0, నరసరావుపేటలో 219.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా రెంటచింతలలో 51.4 మి.మీ. వర్షపాతం మాత్రమే నమోదైంది.

యార్డుకు 27,945 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 27,945 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 26,950 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్‌-5, 273, 341, 4884, సూపర్‌-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 24,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.10,000 నుంచి రూ.21,300 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,500 నుంచి 24,000 వరకు లభించింది.

కన్నీళ్లు తుడి‘చేను’

- కోలుకుంటున్న కర్షకులు
- ప్రభుత్వ చర్యలతో పొలాల్లో తగ్గిన నీరు
- నష్టం అంచనాలు ప్రారంభించిన అధికారులు
- 67,718 హెక్టార్లలో పంటల నష్టం
- 10వ తేదీ నుంచి ఎన్యూమరేషన్ ప్రారంభం



తెనాలి మండలం హాఫ్‌పేట చానల్‌లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగిస్తున్న పొక్లెయిన్

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ప్రభుత్వం తీసుకున్న చర్యలతోపాటు రెండు రోజులుగా ఎండ కాస్తుండటం వల్ల పొలాల్లో నిలిచిన వర్షపు నీరు తగ్గుముఖం పట్టింది. చేలల్లో నీరు తగ్గుదలతో పంటలను కాపాడుకునే పనిలో రైతులు పడ్డారు. అధికార యంత్రాంగం స్పందించి డ్రెయిన్ల ద్వారా పొలాల్లో చేరిన నీటిని వెలుపలకు పంపించే ఏర్పాట్లు చేపట్టింది. దీనికోసం 30 ప్రాంతాల్లో డ్రెయిన్లలో పూడిక తీత చేపట్టింది. 16 యంత్రాలను వినియోగించింది. అధికార యంత్రాంగం ఈ పనులను క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించటం ద్వారా గురువారం నాటికి పొలాల్లో నీరు పూర్తిస్థాయిలో తగ్గింది. దీనికి తోడు రైతు భరోసా కేంద్రాల ద్వారా వర్షాలకు తడిచిన పంటను కాపాడుకునే విధానంపై అవగాహన కల్పించడంతో రైతులు పంటల రక్షణపై దృష్టిపెట్టారు.

ప్రత్యామ్నాయంగా బెంగాల్ గ్రామ్ పంట

అలాగే జిల్లాలో ప్రత్యామ్నాయ పంటగా బెంగాల్ గ్రామ్‌ను నాటుకోవటానికి సబ్సిడీపై విత్తనాలు అందించడం కోసం పది వేల మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించారు. ఈ మేరకు ప్రభుత్వానికి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ప్రతిపాదనలు పంపించారు.

67,718 హెక్టార్లలో పంటల నష్టం

గుంటూరు జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన శాఖల్లో కలిపి మొత్తం 67,718 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ, ఉద్యాన శాఖల అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. నీట మునిగిన పంటలను, వర్షానికి, ఈదురు గాలులకు పడిపోయిన పంటలను అన్నింటినీ పరిగణనలోకి తీసుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వేసిన అన్ని రకాల పంటలనూ లెక్కించి నివేదికలు సిద్ధం చేశారు. ప్రధానంగా వరి, మిరప, శనగ పంటలపై మిచాంగ్ తుఫాన్ ప్రభావం చూపించింది. జిల్లా వ్యవసాయ అధికారి నున్నా వెంకటేశ్వర్లు గురువారం ‘సాక్షి’తో మాట్లాడారు. పంట నష్టపోయిన రైతులు అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. జిల్లాలో దెబ్బతిన్న పొలాలను పరిశీలించి, 10వ తేదీ నుంచి ఎన్యూమరేషన్ ప్రారంభించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని తెలిపారు.

ప్రాథమికంగా పంటల నష్టం ఇలా..

పంట	దెబ్బతిన్న విస్తీర్ణం (హెక్టార్లలో)
వరి	41,834
మిరప	9,619
శనగ	8,580
మినుము	2,745
పొగాకు	1,300
పత్తి	1,054
జొన్న	1,046
అరటి	764
కూరగాయలు	397
మొక్కజొన్న	155
తమలపాకు	152
పూలు	47
కంది	25
మొత్తం	67,718

215.112 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసం

తుఫాన్ ధాటికి జిల్లాలో 215.112 కిలోమీటర్ల మేర రోడ్లు ధ్వంసమైనట్లు ఆర్ అండ్ బీ అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. రెండు చోట్ల ఆర్ అండ్ బీ రోడ్లకు గండ్లు పడ్డాయి. 26 చోట్ల చెట్లు విరిగి పడ్డాయి. 12 చోట్ల రోడ్లపై నుంచి వరద నీరు పారింది. 11 చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. తాత్కాలిక మరమ్మతులకు రూ.10.76 కోట్లు అవసరం అవుతాయని ప్రభుత్వానికి నివేదిక పంపారు.



అత్తోట చానల్‌లో పేరుకున్న తూటికాడను తొలగిస్తున్న రైతులు

ఇళ్లకు తుఫాన్ బాధితులు

తాడేపల్లి, పెదకాకాని, ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు, చేబ్రోలు, గుంటూరు వెస్ట్, దుగ్గిరాలల్లో ఏర్పాటు చేసిన పునరావాస శిబిరాల్లో తలదాచుకున్న 258 కుటుంబాలను అధికారులు ఇళ్లకు చేర్చారు. వీరందరికీ 25 కిలోలు బియ్యం కేజీ నూనె, కేజీ బంగాళదుంపలు కేజీ ఉల్లిపాయలు పంపిణీ చేశారు. ఈ కుటుంబాలకు నగదు సాయంగా మొత్తం రూ.ఐదు లక్షల 2 వేలు చెల్లించారు. గురువారం కూడా అధికారులు, ప్రజాప్రతినిధులు రైతులకు భరోసా ఇచ్చారు.



వట్టిచెరుకూరు మండలంలో మిర్చి రైతులతో మాట్లాడుతున్న ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్

మిర్చి పంట పరిశీలన

ప్రత్తిపాడు: పంటలు దెబ్బతిన్న రైతులు నష్టపరిహారం పొందేలా పక్కాగా జాబితాలను సిద్ధం చేయాలని ఉద్యానశాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.ఎస్.శ్రీధర్ అన్నారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు, చమళ్లమూడి గ్రామాల్లో మిచాన్ తుపాను ప్రభావంతో దెబ్బతిన్న మిర్చి పంటలను గురువారం సాయంత్రం ఉద్యానశాఖ కమిషనర్ శ్రీధర్ పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. పంట నష్టం వివరాలను, ప్రస్తుతం మొక్కల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పంటను కాపాడుకునేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. పారదర్శకంగా పంట నష్టం వివరాలను సేకరించాలని ఉద్యానశాఖ అధికారులను ఆదేశించారు. వెంట జిల్లా ఉద్యాన అధికారి బి.రవీంద్రబాబు, సూక్ష్మ బిందు సేద్యం ప్రాజెక్టు డైరెక్టర్ ఎల్.వజ్రశ్రీ, ప్రత్తిపాడు హెచ్ఓ ఎం.బేబి, ఏఓ కె.లక్ష్మి, లాం శాస్త్రవేత్తలు గిరిధర్, ఫణికుమార్, ఉద్యాన సహాయకులు నవాజ్, వంశీ, రైతులు ఉన్నారు.

నకరికల్లు వద్ద మొసలి సంచారం

భయభ్రాంతులకు గురవుతున్న ప్రజలు

నకరికల్లు: జనసంచార ప్రదేశంలో మొసలి రావడంతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. మండలంలోని నకరికల్లు నుంచి శివాపురంతండా వెళ్లే రహదారిలో రైల్వే వంతెన వద్ద మొసలి సంచరిస్తుంది. మొత్తం రాళ్లు, గుట్టలు ఉండే ప్రదేశం కావడంతో దగ్గరకు వెళ్లే వరకు పాదాచారులకు కన్పించడం లేదు. ఒక్కసారిగా మొసలిని చూసి ప్రజలు ఉలిక్కిపడి భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో పంట కాలువల్లో సంచరిస్తున్న మొసలిని అటవీశాఖ అధికారులు కుంకలగుంట వద్ద బోరు వేసి బంధించి జంతుసంరక్షణ కేంద్రానికి తరలించారు. మొసలి సంచరిస్తున్న ప్రాంతం అటవీప్రాంతానికి ఆనుకొని ఉండడంతో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు కొట్టుకొని వచ్చి ఉంటుందని ప్రజలు భావిస్తున్నారు. నకరికల్లు వద్ద సంచరిస్తున్న మొసలిని వెంటనే బంధించి ప్రాణనష్టం జరగకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ పురుషోత్తంరాజును వివరణ కోరగా మొసలి ఉన్నట్లు తనకు తెలియరాలేదని నిఘా పెడతామని తెలిపారు.



రైల్వేట్రాక్ వద్ద సంచరిస్తున్న మొసలి

సంక్షేమ ‘ఆటో’గ్రాఫ్

- ఉన్నతి– మహిళాశక్తి పథకం ద్వారా వనితలకు ఆటోలు
- 8 మందికి ప్రయోజనం
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ఆటోలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి, జేసీ రాజకుమారి

గుంటూరు వెస్ట్: మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా చేయూతనందిస్తోందని కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్ ఆవరణలో ఉన్నతి–మహిళాశక్తి పథకంలో భాగంగా 8 మంది ఎస్సీ, ఎస్టీ స్వయం సహాయక సంఘాల మహిళలకు పంపిణీ చేసిన ఆటోలను జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా నిలబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అనేక పథకాల్లో ఇదొకటని కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డి పాల్గొన్నారు.

సొంత ఆటో చాలా గౌరవంగా ఉంది



జగనన్న మా కోసం ఒక ఆటో ఇచ్చారు. నాతోపాటు నా భర్త కూడా ఆటో డ్రైవరే. ఈ ఆటోతో మూడు కుటుంబాలు జీవించే అవకాశముంటుంది. అంతకు ముందు రోజుకు రూ.300 చెల్లించి అద్దె ఆటో తీసుకునేవాళ్లం. ఇప్పుడు సొంత ఆటో రావడం చాలా సంతోషంగా ఉంది. నా బిడ్డల్ని బాగా చదివించేందుకు ఉపయోగపడుతుంది.

– డి.అమల, మేడికొండూరు మండలం, యలవర్తిపాడు గ్రామం

రూపాయి లంచం లేకుండా ఇచ్చారు



అర్హతలను బట్టి నాకు ఈ ఆటో వచ్చింది. ఎక్కడా రూపాయి కూడా లంచం అడగలేదు. పీడీ హరిహరనాథ్ సార్ చొరవతో మా అందరికీ ఆటోలు వచ్చాయి. ప్రభుత్వ రుణం తీర్చుకోలేనిది. మా కుటుంబానికి ఆర్థిక స్వావలంబన కలుగుతుంది.

– కె.శ్రీవల్లిక, చేబ్రోలు

నేడు బాపట్ల జిల్లాలో సీఎం వైఎస్ జగన్ పర్యటన

సాక్షి, బాపట్ల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం బాటప్ల జిల్లాలో పర్యటిస్తారు. 1.05 గంటలకు హెలికాప్టర్‌లో బాపట్ల పరిధిలోని మరుప్రోలువారిపాలెం 216 జాతీయ రహదారి వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ వద్ద దిగుతారు. 1:15 గంటల వరకు స్థానిక నేతలతో మాట్లాడతారు. 1.40 గంటల వరకు అక్కడ పంట నష్టాలపై ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శనను, స్టాళ్లను పరిశీలిస్తారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి 1.50 గంటలకు కర్లపాలెం మండలం పాతనందాయపాలెం గ్రామానికి చేరుకుంటారు. 2.35 గంటల వరకు నీటమునిగిన మిర్చి పంటను పరిశీలించి రైతులతో మాట్లాడతారు. 3.10 గంటలకు సమీపంలోని బుద్దాం గ్రామానికి వెళ్లి అక్కడ దెబ్బతిన్న వరి పంటను పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడతారు. 3.15 గంటలకు తిరిగి రోడ్డు మార్గాన బయలుదేరి 3.30 గంటలకు మరుప్రోలువారిపాలెం 216 జాతీయ రహదారి వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. 3.35 గంటలకు అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నాలుగు గంటలకు తాడేపల్లికి చేరుకుంటారు.

ఉధృతంగా కొండవీటి వాగు

తాడికొండ – కంతేరు మధ్య రాకపోకలు బంద్



తాడికొండలో నీట మునిగిన పంట పొలాలు



కంతేరు– తాడికొండ మధ్య రోడ్డుపై ప్రవహిస్తున్న వరద నీరు

తాడికొండ: మిచాంగ్ తుఫాన్ ధాటికి కురిసిన భారీ వర్షానికి తాడికొండ, తుళ్లూరు మండలాల్లో ఉప్పొంగిన కొండవీటి వాగు వరద ఉధృతి ఇంకా తగ్గకపోవడంతో పంట పొలాలు నీటిలోనే మునిగి తేలియాడుతున్నాయి. పై నుంచి వస్తున్న వరద దెబ్బకు తాడికొండ – కంతేరు మధ్య ఎర్రవాగు వద్ద భారీగా రోడ్డుపైకి రావడంతో రెండు రోజులుగా రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇంకా వరద నీటిలోనే పంట పొలాలు ఉండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వాలు కొండవీటి వాగు వరద ఉధృతికి తగిన చర్యలు తీసుకోకుండానే నామమాత్రంగా హడావుడిగా పనులు చేసి చేతులు దులుపుకోవడంతో ఈ దుస్థితి ఏర్పడిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొండవీటి వాగు వరదను ఎత్తిపోసేందుకు తాడేపల్లి వద్ద ప్రకాశం బ్యారేజ్‌కు ఆనుకొని పంప్‌హౌస్‌ను నిర్మించారు. కానీ క్షేత్రస్థాయిలో కొండవీటి వాగును ఆధునీకీకరించి పూడికతీత తీయని కారణంగా వరద ఉధృతి దిగువకు వెళ్లే పరిస్థితి లేని కారణంగా కట్టలు తెంచుకొని పంట పొలాలపై పడుతుంది. నిధులు కైంకర్యానికే తప్ప బాబు హయాంలో కొండవీటి వాగు పేరిట చేసిన హడావుడితో తమకు నష్టం తప్ప జరిగిన ప్రయోజనం ఏమీ జరగలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

కేఎల్‌యూలో అంతర్జాతీయ సదస్సు ప్రారంభం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభించారు. ప్రొ.చాన్స్‌లర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం, విభాగాధిపతి డాక్టర్ కె.స్వప్న జ్యోతి ప్రజ్వలన చేసిన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రొ.చాన్స్ లర్ డాక్టర్ కేఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ విద్యుత్ నిల్వ చేయడంలో భౌతిక శాస్త్ర సహకారం ఎంతో అవసరమని అన్నారు. ప్రపంచం ఎదుర్కొంటున్న విద్యుత్ సవాళ్లను పరిష్కరించడంలో అధునాతన ఫంక్షనల్ మెటీరియల్స్ కీలకపాత్రపై సమావేశం కేంద్రీకృతమై ఉందన్నారు. స్థిరమైన ఇంధన ఉత్పత్తి, నిల్వ, పరిరక్షణ, సాంకేతిక పురోగతిని సాధించడానికి అంతర్జాతీయస్థాయిలో శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని వివరించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎస్.షణ్ముగన్ మాట్లాడుతూ భవిష్యత్తు తరాలకు విద్యుత్ కొరత అనేది లేకుండా చేయాలంటే ఇప్పటి నుంచే స్థిరమైన విద్యుత్ వనరులను ఏర్పాటు చేసేదిశగా పరిశోధనలు జరగాలని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మొత్తం 24 మంది రిసోర్స్ పర్సన్‌లు, పరిశోధకులు, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ జి.పార్థసారధి వర్మ, ప్రొ.వైస్ చాన్స్‌లర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్.వెంకటరామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, ఎఫ్ఈడీ డైరెక్టర్ డాక్టర్ ఎ.జగదీష్, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిషోర్‌బాబు, పరిశోధన, అభివృద్ధి డీన్ డాక్టర్ బి. జయకుమార్ సింగ్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.సుబ్రహ్మణ్యం, ఎఫ్ఈడీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ శివగంగా ప్రసాద్, సెంటర్ ఫర్ సోలార్ ఎనర్జీ హైదరాబాద్ నుంచి ప్రొఫెసర్ ఈశ్వర మూర్తి రామస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడి దుర్మరణం

అద్దంకి రూరల్: లారీ బైకును ఢీకొట్టడంతో వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందగా మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన అద్దంకి పట్టణంలో గురువారం కలవకూరు జంక్షన్ వద్ద చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అద్దంకి పట్టణంలోని పెరికపాలేనికి చెందిన కుంచాల నరసింహారావు (70), రోశయ్యలు బైకు మీద అద్దంకి–నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై వెళ్తుండగా కలవకూరు జంక్షన్ వద్దకు రాగానే వెనుకగా వస్తున్న లారీ వేగంగా వచ్చి బైకును ఢీకొట్టింది. దీంతో నరసింహారావు కాలుపై నుంచి లారీ వెళ్లటంతో నుజ్జునుజ్జయి తీవ్ర రక్తస్రావమైన నరసింహారావు మృతి చెందాడు. రోశయ్యను ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు.

యుద్ధప్రాతిపదికన డ్రెయిన్ల ప్రక్షాళన

- శరవేగంగా తరలిపోతున్న వర్షపునీరు
- పంటల నష్ట నివారణకు దోహదం

తెనాలి: పంట భూములకు సాగునీరు అందించటం ఎంత ముఖ్యమో... భారీ వర్షాలకు పంటచేలల్లో చేరిన నీటిని త్వరితగతిన బయటకు పంపటం అంతే ముఖ్యమని తెలిసిందే. సాగునీటిని పంటకాల్వలు అందిస్తుంటే, వృథానీటిని మురుగు కాల్వలు బయటకు పంపేస్తుంటాయి. ఈ రెండు వ్యవస్థలు సక్రమంగా పని చేసినప్పుడే అన్నదాతలకు తగిన ప్రయోజనం నెరవేరుతుంది. ప్రస్తుతం మిచాంగ్ తుఫాన్ కారణంగా పంట చేలను ముంచిన నీటిని మురుగు కాల్వలతో బయటకు పంపే కార్యక్రమం యుద్ధప్రాతిపదికన జరుగుతోంది.

తెనాలి నియోజకవర్గంలో హార్వెస్టింగ్ యంత్రాలతో రైతులు ముదురు వరిచేలను నూర్పిడి చేస్తున్నారు. తెనాలి రూరల్ మండలం, కొల్లిపర మండలాల్లో దాదాపు ఏడు వేల ఎకరాల్లో నూర్పిడి పూర్తయింది. వ్యాపారులు కల్లాల వద్దకే వచ్చి, మద్దతు ధరను మించి క్వింటాలు రూ.1700 వరకు కొనుగోలు చేస్తున్నారు. మరో వారం, పదిరోజుల్లో వరి పైరు మొత్తం కోతకు సిద్ధంకానున్న సమయంలో వచ్చిన మిచాంగ్ తుఫాన్ ధాటికి సోమ, మంగళ వారాల్లో దాదాపు 36 గంటలపాటు భారీ వర్షాలు కురిశాయి. డివిజనులో12 సెం.మీ పైగా వర్షపాతం నమోదైంది. దీనికితోడు భారీ ఈదురు గాలులకు ఏపుగా పెరిగిన వరి పైరు నేలకొరిగింది. నియోజకవర్గం పరిధిలోని రెండు మండలాల్లో 23,325 ఎకరాల్లో వరిపైరు నేలకొరిగింది. అన్ని చేలల్లో వర్షపు నీటిలో ఉండిపోయింది.

సత్వరం వర్షపు నీటిని బయటకు పంపి, రైతులకు నష్టాన్ని తగ్గించాలన్న భావనతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఆగమేఘాలపై బుధవారం పంట చేలను సందర్శించారు. రైతులతో మాట్లాడి పరిస్థితులను తెలుసుకున్నారు. చేలల్లో నిలిచిన వర్షపునీరు వేగంగా బయటకు వెళ్లేందుకు డ్రెయిన్లలో పలుచోట్ల తూటాకు, గుర్రపు డెక్క పేరుకు పోయిందని స్వయంగా గమనించారు. జేసీబీలను ఉపయోగించి యుద్ధప్రాతిపదికన వాటిని తొలగించాలని, పంటపొలాల్లో నిలిచిన నీటిని సత్వరం వెళ్లేలా చూడాలని ఆదేశాలు జారీచేసిన విషయం తెలిసిందే.



గుంటూరు నల్ల డ్రెయినులో తూటాకు, గుర్రపుడెక్క తొలగించాక వర్షపు నీటి ప్రవాహం



తెనాలి మండలం బుర్రిపాలెం వద్ద రేపల్లె మెయిన్ డ్రెయినులో తూటాకు తొలగింపు



నేలపాడులో డ్రెయిను ప్రక్షాళన ఇలా..

దీంతో అప్పటికప్పుడు కార్యాచరణ మొదలైంది. తెనాలి–గుంటూరు వయా నందివెలుగు రోడ్డులో హాఫ్‌పేట వద్ద గల గుంటూరు నల్ల డ్రెయిను, మంగళగిరి నియోజకవర్గంలోని పెదవడ్లపూడి వద్ద ఆరంభమై నంబూరు, హాఫ్‌పేట, వీరనాయకునిపాలెం, శేకూరు, శలపాడు, సంగంజాగర్లమూడి వద్ద అండర్ టన్నెల్‌లోంచి తుంగభద్ర డ్రెయినులో కలుస్తుంది. మొత్తం 24 కిలోమీటర్ల పొడవైన ఈ డ్రెయినుకు హాఫ్‌పేట వద్ద దట్టంగా అల్లుకుపోయిన తూటాకు, గుర్రపు డెక్కను బుధవారం సాయంత్రానికే తొలగించారు. అక్కడి నుంచి మురుగునీరు తుంగభద్ర డ్రెయినులో త్వరితంగా కలిసేందుకు వీలుగా అండర్ టన్నెల్ దగ్గర పరిశుభ్రం చేయగలిగారు. హాఫ్‌పేట గ్రామస్తులు, రైతుల వినతిపై గ్రామం పక్కనే గల మరో డ్రెయినును ప్రక్షాళన చేశారు. వీటితోపాటు నందివెలుగు, హాఫ్‌పేట, వెంకట కృష్ణాపురం, ఉప్పలపాడు వరకు రోడ్డు పక్కన మురుగు కాల్వలను పరిశుభ్రం చేయటంతో పంటచేలల్లోని నీరు శరవేగంగా మురుగు కాల్వల్లోకి ప్రవహిస్తోంది.

ఇతర డ్రెయిన్ల ప్రక్షాళన...

రూరల్ మండలం బుర్రిపాలెం వద్ద రేపల్లె మెయిన్ డ్రెయినులో పేరుకున్న తూటాకు, గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించి, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూశారు. హాఫ్‌పేట– వెంకట కృష్ణాపురం మధ్యలో గల కొలకలూరు నెం.1 డ్రెయిన్, తేలప్రోలు డ్రెయిను, రూరల్ మండలం నేలపాడు, కొల్లిపర మండలంలోని అత్తోట యాదవపాలెం, మున్నంగి, పిడపర్రు, దావులూరు వద్ద గల డ్రెయిన్లలో అడ్డంకులను తొలగిస్తున్నారు. ఈ పనులు గురువారం కూడా కొనసాగించారు. పట్టణంలోని గోలీడొంక, మండలంలోని నేలపాడు, అత్తోట యాదవపాలెం వద్ద పనులు జరుగుతున్నట్టు డ్రెయినేజీ డివిజను డీఈఈ ఎం.అనిల్‌కుమార్ చెప్పారు.

రైతుల వినతి మేరకు పట్టణ చినరావూరులో రైల్వే ట్రాక్ వెంబడి డ్రెయిను పరిస్థితిని గురువారం సాయంత్రం తెనాలి సబ్‌కలెక్టర్ గీతాంజలి శర్మ సందర్శించారు. డ్రెయినేజీ సిబ్బంది అక్కడకు వెళ్లి జేసీబీ వెళ్లే అవకాశంపై పరిశీలన చేసినట్టు డీఈఈ తెలిపారు. వీటితోపాటు మంగళగిరి రోడ్డులోని అక్షయపాత్ర వద్ద ఆత్మకూరు డ్రెయిను, నూతక్కి దగ్గర జేసీబీలు డ్రెయిన్లలో అవరోధాలను తొలగించే పనిలో ఉన్నట్టు చెప్పారు. రెండురోజులుగా నిర్విరామంగా చేస్తున్న పనులతో ఉధృతంగా ప్రవహిస్తున్న ప్రధాన డ్రెయిన్లలో నీరు అడుగు వరకు తగ్గాయనీ, శుక్రవారం మరో అడుగు తగ్గి, వెనువెంటనే చేలల్లోని నీరంతా వెళ్లిపోతుందని పనులను పర్యవేక్షిస్తున్న రేపల్లె డ్రెయినేజీ ఈఈ పి.వెంకటరత్నం వెల్లడించారు.

గంటల వ్యవధిలోనే..



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి రైతు సంక్షేమానికే ప్రథమ ప్రాధాన్యతనిస్తోంది. తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటామని ప్రకటించటమే కాకుండా, పంట నష్టాన్ని వీలైనంత మేరకు తగ్గించడానికి పంట పొలాల్లోని నీటిని బయటకు సత్వరం బయటకు పంపాలని సీఎం ఆదేశించారు. ఆ ప్రకారం నియోజకవర్గంలోని ప్రధాన డ్రెయిన్లను గంటల వ్యవధిలోనే ప్రక్షాళన చేయించాం.

–అన్నాబత్తుని శివకుమార్, ఎమ్మెల్యే

ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకోవాలి

కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి

గుంటూరు వెస్ట్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో ప్రజల అవగాహన కోసం ఏర్పాటు చేసిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాన్ని ఆయన పరిశీలించారు. కొన్ని సందర్భాల్లో ఓటింగ్ సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు గుర్తించిన ఎన్నికల కమిషన్ ఈ ఏర్పాటు చేసిందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కేంద్రం తెరిచి ఉంటుందన్నారు. సిబ్బంది ఓటింగ్ విధానంపై వివరిస్తారని చెప్పారు. సమావేశంలో డీఆర్వో చంద్రశేఖరరావు, డ్వామా పీడీ వెంకట శివ రామిరెడ్డి పాల్గొన్నారు.

సైనికుల నిధికి ఆర్థిక చేయూతనందించండి

దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసే సైనిక కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవడం మన బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సైనికులకు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖాధికారి గుణశీల, డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేశాం

గుంటూరు వెస్ట్: మిచాంగ్ తుఫాన్ నేపథ్యంలో ముందస్తు చర్యలు, పటిష్ఠ ఏర్పాట్లు చేయడం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరగకుండా చూడగలిగామని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్ రెడ్డి నిర్వహించిన వీడియో సమావేశానికి స్థానిక కలెక్టరేట్ నుంచి జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. తుఫాను ప్రభావం ఉన్న 299 ప్రాంతాల్లో విద్యుత్ అంతరాయ ఏర్పడితే బుధవారం నాటికి పూర్తి స్థాయిలో పునరుద్ధరించామన్నారు.

మణిపాల్‌లో 100 రోబోటిక్ అసిస్టెడ్ శస్త్రచికిత్సలు పూర్తి

హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి



మణిపాల్ హాస్పిటల్ (ఫైల్)

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ హాస్పిటల్ రోబోటిక్ అసిస్టెడ్ సర్జరీలు ప్రారంభించినప్పటి నుంచి 100 శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహించిందని హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కంటిపూడి అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మణిపాల్ హాస్పిటల్ అత్యాధునిక 4వ జెన్ డావిన్సీ ఎక్స్ రోబొటిక్ అసిస్టెడ్ శస్త్రచికిత్స యూనిట్లను ప్రారంభించడంతో వైద్యసాంకేతికతలో గణనీయమైన పురోగతిని సాధించిందని, ఏడు స్పెషాలిటీలలో వీటిని కొత్తగా ప్రవేశపెట్టామని, రోబోటిక్ సర్జరీలు గ్యాస్ట్రో ఇంటెస్టినల్, అంకోలాజికల్, యూరాలజీ, గైనకాలజీ, బేరియాట్రిక్ సర్జరీ ప్రొసీజర్లలో ఎక్కువగా ఉపయోగించబడుతున్నాయని తెలిపారు. మినిమల్లీ ఇన్వాసివ్ సర్జరీ, బేరియాట్రిక్ సర్జన్ డాక్టర్ సురేంద్ర జాస్తి, కన్సల్టెంట్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ వి. ధర్మేంద్ర కుమార్, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ మరియు కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్ డాక్టర్ రవిశంకర్ గంజి, కన్సల్టెంట్ ప్రసూతి వైద్యురాలు డాక్టర్ లక్ష్మి ప్రసూనలు రోబోటిక్ సహాయంతో శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహిస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు 100కు పైగా సర్జరీలను పూర్తిచేశామని, 60కి పైగా జీఐ మరియు బేరియాట్రిక్ సర్జరీలు, 30కి పైగా సర్జికల్ ఆంకాలజీ సర్జరీలు, యూరాలజీ, గైనక్ సర్జరీలు నిర్వహించామని తెలిపారు.

వృద్ధురాలిపై యువకుడి లైంగిక దాడి

విచారణ చేపట్టిన డీఎస్పీ

వినుకొండ(నూజెండ్ల): వృద్ధురాలిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన వినుకొండ పట్టణం మేదరబజారులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మేదరబజారులో నివాసం ఉంటున్న చందా లక్ష్మమ్మ (74)పై అర్ధరాత్రి సమయంలో సుమారు 20 ఏళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. కొంతసేపటి తర్వాత తేరుకున్న ఆమె స్థానికుల సహాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై నరసరావుపేట డీఎస్పీ మహేష్, టౌన్ సీఐ సాంబశివరావులు సంఘటనా ప్రాంతానికి వెళ్లి విచారణ చేపట్టారు. వృద్ధురాలిపై లైంగికదాడికి పాల్పడిన యువకుడి వివరాలు సేకరించి త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

నష్టపోయిన ప్రతిఒక్క రైతుకూ పరిహారం

- సాగుదారులకు న్యాయం చేస్తాం
- భూ యజమానులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు మానవత్వంతో ఆలోచన చేయాలి
- పక్కాగా పంట నష్టం అంచనాలు
- కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- పాతమల్లాయపాలెంలో దెబ్బతిన్న పంటల పరిశీలన



పాతమల్లాయపాలెంలో మిర్చి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి

ప్రత్తిపాడు: పంట నష్టపోయిన ప్రతి ఒక్క రైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకోవడంతో పాటు పంట సాగు చేసిన సాగుదారులకు న్యాయం జరిగేలా చూస్తామని జిల్లా కలెక్టర్ ఎం. వేణుగోపాల్ రెడ్డి అన్నారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో గురువారం కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రత్తిపాడు మండలం పాత మల్లాయపాలెం, వంగిపురం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో కలసి కలెక్టర్ పరిశీలించారు. మిర్చి, శనగ రైతులతో మాట్లాడారు.

మిర్చి సాగుకు ఎంత పెట్టుబడులు పెట్టారు? ఎంత మేర నష్టం వాటిల్లుతుంది.. వంటి వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. మిర్చి మొక్కలు నీటనాని వేర్లు కుళ్లి పోతున్నాయని, శనగ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని వివరించారు. ముందుగా పొలాల్లో నిలిచిన నీటిని బయటకు పంపుకుని, పంటను కాపాడుకోవాలని సూచించారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు పంట రక్షణకు తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. అదేవిధంగా రైతులు నీటిని బయటకు పంపుకునేందుకు వీలుగా పంట కాలువల్లో అడ్డంకులను కూలీల ద్వారా తక్షణమే యుద్ధప్రాతిపదికన తొలగించాలని డ్వామా పీడీ వెంకట శివరామిరెడ్డిని, పంటలు పరిశీలించి తీసుకోవలసిన సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించాలని ఉద్యాన, వ్యవసాయశాఖ అధికారులతో పాటు శాస్త్రవేత్తలకు సూచించారు.

పక్కాగా పంట నష్టం అంచనాలు

ఒక్కసెంటు కూడా వదిలిపెట్టకుండా పక్కాగా పంట నష్టం అంచనాలను సిద్ధం చేయడం జరుగుతుందని కలెక్టర్ రైతులకు స్పష్టం చేశారు. పాత మల్లాయపాలెం గ్రామంలో కొందరు రైతులు పొలాన్ని తాము సాగు చేస్తున్నామని, పరిహారం భూ యజమానులకు వెళుతుందని, కాస్తంత దయ చూపి పరిహారం సాగు చేస్తున్న రైతులకు వచ్చేలా చూడాలని కలెక్టర్‌కు విన్నవించారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సర్పంచ్‌తో మాట్లాడారు. భూ యజమానులు, గ్రామస్తులతో మాట్లాడి పరిహారం సాగుదారులకు వచ్చేలా నచ్చజెప్పాలన్నారు. ఇలాంటి సమయంలో ప్రతి ఒక్కరం మానవత్వంతో ఆలోచన చేయాల్సి ఉంటుందన్నారు. వ్యవసాయశాఖ సిబ్బంది క్షేత్రస్థాయికి వచ్చి పంట నష్టం అంచనాలకు ఎలాంటి లోటుపాట్లుకు తావులేకుండా నమోదు చేస్తారని చెప్పారు. ఆయన వెంట గ్రామ సర్పంచ్ కాసు పద్మావతి, కొత్తమల్లాయపాలెం సర్పంచ్ కుందూరి లక్ష్మారెడ్డి, ఆర్డీఓ పి. శ్రీకర్, జిల్లా వ్యవసాయాధికారి నున్న వెంకటేశ్వర్లు, జిల్లా ఉద్యాన అధికారి బి. రవీంద్ర బాబు, జిల్లా పంచాయతీ అధికారి శ్రీదేవి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఉడుతూరి ఓంప్రకాష్ రెడ్డి, గుజ్జుల శివారెడ్డి, కాసు రాజశేఖర్ రెడ్డి, వ్యవసాయ, ఉద్యాన, ఇరిగేషన్, డ్రెయినేజీ, అధికారులు పాల్గొన్నారు.

ఐక్యంగా సంక్షేమం కోసం పనిచేద్దాం

జిల్లా పోలీస్ అసోసియేషన్, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులతో ఎస్పీ




మాట్లాడుతున్న ఎస్పీ ఆరిఫ్‌హాఫీజ్

నగరంపాలెం: జిల్లాలోని పోలీస్ సిబ్బంది సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేద్దామని జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పిలుపునిచ్చారు. నగరంపాలెం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో గురువారం జిల్లా పోలీస్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులతో సంక్షేమ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా వ్యాప్తంగా విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల సంక్షేమం కోసం అమలవుతున్న కార్యక్రమా ల నిర్వహణపై తొలుత సమీక్ష చేశారు. ఆరోగ్యం, విద్య, విధి నిర్వహణ, తదితర అంశాలపై చర్చించారు. ప్రతి ఒక్కరూ సంక్షేమాన్ని సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరి భద్రత, భరోసాకు పెద్దపీట వేస్తామని, ఏ ఒక్కరికీ సమస్య వచ్చిన వాటిని వెంటనే పరిష్కరించేందుకు సత్వర చర్యలు ఉంటాయని చెప్పారు. ఏమాత్రం అలసత్వం ఉండదని స్పష్టం చేశారు. సమావేశంలో ట్రాఫిక్ డీఎస్పీ బాల సుందరరావు, ఎస్బీ ఇన్‌చార్జ్ సీఐ బాలసుబ్రమణ్యం, గుంటూరు జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఆరోగ్యరాజు, ఆర్ఐ రాజారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం ప్రతినిధులు ఎస్ఐ కిషోర్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కరిముల్లా, లక్ష్మణ్, మైలా సాంబశివరావు, జానయ్య, ఎస్పీ సీసీ శ్రీనివాసరావు, డీపీఓ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్ విజయకు అరుదైన గౌరవం

ఆసియా స్ట్రోక్ అడ్వైజర్ సలహా ప్యానల్ సభ్యురాలిగా నియామకం



ప్యానల్ సభ్యులతో డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన సీనియర్ న్యూరాలజిస్ట్, లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పమిడిముక్కల విజయకు అరుదైన గౌరవం లభించింది. ఆసియా స్ట్రోక్ అడ్వైజరీ ప్యానల్ సభ్యురాలిగా ఆమె నియమితులయ్యారు. హాంకాంగ్‌లోని రీగల్ రివర్‌సైడ్ హోటల్‌లో నవంబరు 30న జరిగిన ఆసియా స్ట్రోక్ అడ్వైజరీ ప్యానల్ 51వ సమావేశంలో డాక్టర్ విజయను ప్యానల్ సభ్యురాలిగా ఎంపిక చేసి ప్యానల్ చైర్మన్ ప్రొఫెసర్ త్సాంగ్ చాయ్‌లి ఉత్తర్వులు జారీ చేశారు. ఆసియా స్ట్రోక్ అడ్వైజరీ ప్యానల్ 1996లో ప్రారంభించబడింది. పక్షవాతం నిర్ధారణ, చికిత్స, నివారణలో ఉత్తమ పద్ధతులను పంచుకోవడానికి, పక్షవాతంపై అవగాహన పెంచడానికి దీన్ని స్థాపించారు. ప్రతీదేశం నుంచి ఇద్దరు క్రియాశీలక సభ్యులను ఆసియా స్ట్రోక్ అడ్వైజరీ ప్యానల్ సభ్యులుగా ఎంపిక చేశారు. భారత దేశం నుంచి డాక్టర్ విజయ అడ్వైజరీ ప్యానల్ సభ్యురాలిగా ఎంపికయ్యారు.

సిగరెట్ల అక్రమ రవాణాపై దాడులు



దాడుల్లో సీజ్ చేసిన సిగరెట్ బండిలు

పాత గుంటూరు: గుంటూరు సీ జీఎస్టీ పరిధిలో రెండు లారీలలో అక్రమంగా రవాణా చేస్తున్న సిగరెట్‌లపై సీజీఎస్టీ నిఘా అధికారులు దాడులు చేసి సిగరెట్‌లను స్వాధీనం చేసుకున్నట్లు సీజీఎస్టీ సంయుక్త కమిషనర్ బి.లక్ష్మీనారాయణ తెలిపారు. కమిషనర్ సాధు నరసింహా రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన దాడుల్లో సంతమాగులూరు, నెల్లూరు సమీపంలో రెండు లారీల్లో తరలిస్తున్న 69,30,000 సిగరెట్లను స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వాటి విలువ రూ. 3.4 కోట్లు ఉంటుందన్నారు. సిగరెట్లు స్మగ్లింగ్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

మచ్చుకాయల పేరుతో మహిళల చేతివాటం

- పోలీసులకు అప్పగింత
- రైతులకు అన్యాయం జరిగితే సహించం
- మిర్చియార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ



మిరప కాయలు దొంగిలిస్తూ పట్టుబడ్డ ఇరువురు మహిళలను తీసుకెళ్తున్న నల్లపాడు పోలీసులు

కొరిటెపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డులో మచ్చుకాయల పేరుతో చేతి వాటం ప్రదర్శిస్తున్న ఇరువురు మహిళలను మిర్చియార్డు భద్రతా సిబ్బంది రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని నల్లపాడు పోలీసులకు అప్పగించారు. కొంతకాలంగా యార్డులో మచ్చుకాయలతో పాటు రైతుల సరుకు దొంగిలించే కార్యకలాపాలకు అడ్డుకట్ట పడింది. రైతులకు నష్టం కలిగించే ఈ తరహా కార్యకలాపాలకు యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ అడ్డుకట్ట వేశారు. ఇది సహించలేక కొందరు వందల సంఖ్యలో మిర్చియార్డు వద్ద ఆందోళనలు చేయడంతో పాటు చైర్మన్ రాజనారాయణ కారును అడ్డగించి దాడికి యత్నించారు. దీంతో చైర్మన్ రాజనారాయణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసులు నమోదు చేశారు. ఇది సహించలేని కొంత మంది 6 నెలల క్రితం మిర్చి యార్డులో మిరప కాయలు దొంగలిస్తున్న మహిళను సెక్యూరిటీ గార్డులు పట్టుకొని ఈ తరహా పనులకు పాల్పడవద్దని మందలించారు. అయితే ఆ ఘటన చైర్మన్‌గా రాజనారాయణ వచ్చాక జరిగిందని అసత్య ప్రచారం చేస్తూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అయితే సదరు మహిళ, మరో మహిళతో కలిసి గురువారం మిర్చియార్డులో మిరపకాయలు ఏరుకోవడానికి వచ్చి దొంగతనం చేస్తూ పట్టుబడడం గమనార్హం. ఈ సందర్భంగా యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ మాట్లాడుతూ మిర్చి యార్డులో మచ్చుకాయల తీతను నిషేధించడం జరిగిందన్నారు. రైతుల బస్తాల నుంచి మిరప కాయలు దొంగతనం చేసే వారిని ఉపేక్షించేది లేదన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి మిర్చి యార్డుకు వచ్చే రైతులకు నష్టం కలిగించే చర్యలను ఎట్టిపరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.

గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం దగ్ధం

భట్టిప్రోలు: గ్యాస్ లోడుతో వెళుతున్న వాహనం నుంచి గురువారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తం కావడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే స్థానిక సాయి జ్యోతి ఇండేన్ గ్యాస్ కంపెనీ నుంచి సిలిండర్‌లు డెలివరీ ఇచ్చేందుకు వాహనంలో డ్రైవర్ శ్రీకాంత్, డెలివరి బాయ్ ఐలవరం బయలుదేరారు. భట్టిప్రోలు–ఐలవరం మధ్యకు వచ్చేసరికి వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అప్రమత్తమైన డ్రైవర్, డెలివరీ బాయ్ వాహనంలోని 20 గ్యాస్ బండలను బయటకు లాగేయడంతో పెను ప్రభావం తప్పింది. గ్యాస్ కంపెనీ నిర్వాహకులు పరిశీలించారు.